ప్రజాశక్తి
గురువారం 18 జనవరి 2024
5
పార్వతీపురం మన్యం

గిరిపుత్రుల కష్టాలను ముఖ్యమంత్రికి వివరిస్తా

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు

శృంగవరపుకోట : గిరి శిఖరాల పైన ఉండే గిరి పుత్రుల కష్టాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు అన్నారు. గిరి పుత్రుల డోలిమోతలపై ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనాలకు ఆయన స్పందించి బుధవారం మండలంలోని మూల బొడ్డవర పంచాయతీ చిట్టెంపాడు గ్రామంలో చనిపోయిన మాదాల గంగమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె భర్త గంగులను ఓదార్చారు. అనంతరం ఆయన అక్కడ యువతతో మాట్లాడగా వారు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. విశాఖ కేజిహెచ్ లో వైద్యం మాత్రమే చేస్తున్నారని, సరైన మందులు ఇవ్వటం లేదని వారు వాపోయారు. గిరిజనులకు అందాల్సిన హక్కులు సక్రమంగా అందటం లేదని. గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక నాన్న అవస్థలు పడుతున్నామని తెలిపారు. గంగులు కుటుంబాన్ని ఓదార్చిన చైర్మన్ సమస్యలన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ విధానాల కారణంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో క్రమంగా చెరకు సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. తగినంతగా సాగులేదని సాకుచూపుతూ ఉన్న పరిశ్రమలను ప్రభుత్వం ఎత్తివేసింది. దీంతో, సాగు రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తూ అష్టకష్టాలతో సంకిలి ఫ్యాక్టరీకి తరలించుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

తగ్గుతున్న చెరకు సాగు

- రైతుకు సహకార కరువు
- సుగర్ పాలసీ రూపొందించని రాష్ట్ర ప్రభుత్వం
- మద్దతు ధర కల్పించని కేంద్రం
- భీమసింగి సుగర్స్ తెరిపించేందుకు నిరాసక్తత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు చెరకు సాగుకు పెట్టింది పేరు. పెద్దగా సాగునీటి ప్రాజెక్టులు పెద్దగా లేకపోవడంతో నీటి వసతిలేమిని ఎదుర్కొనే చెరకు, గోగు, జనుములు విస్తారంగా పండేవి. అందుకే సుమారు 20కిపైగా జూట్ మిల్లులు, ఇటు భీమసింగి, అటు లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీలు జిల్లాలో ఉండేవి. నిత్యం కార్మికులతో కళకళలాడేవి. ఇటు చెరకు, గోగు రైతులు కూడా ఉత్సాహంగా సాగుచేసేవారు. ఇదంతా ఒకప్పటి మాట. మారిన ప్రభుత్వ విధానాల కారణంగా మద్దతు ధర లేకపోవడంతో దాదాపు గోగు, జనుముల సాగు క్రమంగా తగ్గిపోయింది. ఫలితంగా గోగు నార కొనుగోలు కేంద్రాలు (సిసిఎఫ్), జ్యూట్ మిల్లులు దాదాపు కనుమరుగయ్యాయి. ఈ సంగతి కాస్త పక్కనబెడితే.... ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో చెరకు సాగు సాగువిస్తీర్ణం 50వేల ఎకరాలకుపైగా ఉండేది. సాగులో రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేకపోవడం, కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించకపోవడం, గత పదేళ్లగా కొత్తగా పరిశోధనలు చేపట్టకపోవడం వంటి కారణాల వల్ల వల్ల ఫ్యాక్టరీల్లో రికవరీ తగ్గిపోయింది. దీంతో, రైతులు క్రమంగా చెరకు సాగును తగ్గించుకుంటున్నారు. 2014-15లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో చెరకు సాధారణ విస్తీర్ణం 37,297 ఎకరాలుకాగా, ప్రస్తుతం 11,265 ఎకరాలకు తగ్గింది. దీన్నిబట్టి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 26,032 ఎకరాలు తగ్గిపోయినట్టు స్పష్టమౌతోంది. రాష్ట్రంలో చెరకు పరిశోధనలు గడిచిన రెండు దశాబ్దాలకాలంగా జరగడం లేదు. ఫలితంగా సుమారు పదేళ్లగా కొత్తరకం విత్తనాలు అందుబాటులో లేకపోవడం వల్ల దిగుబడి కూడా సగానికి సగం తగ్గిపోతోంది. సుగర్ రికవరీ రేటు కూడా మన రాష్ట్రంలో 9.5శాతానికి మించిరావడం లేదు. మరోవైపు చెరకు రైతులకు సబ్సిడీ పథకాలు లేవు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉత్పత్తికి అయ్యే ఖర్చుపై మద్దతు ధర ప్రకటించకపోవడం వల్ల రైతులకు గిట్టుబాటు కాని పరిస్థితి. ధరలో లోటును భర్తీచేసే చెరకు పాలసీని కూడా పదేళ్ల క్రితమే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో, జిల్లాలో క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గింది. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 60వేల ఎకరాల నుంచి 11వేల ఎకరాలకు తగ్గింది. అనివార్యంగా ఉత్పత్తి కూడా అదే స్థాయిలో తగ్గింది. ఇందుకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం సాగు, దిగుబడి తగ్గడాన్ని బూచిగా చూపి ఏకంగా పరిశ్రమలనే మూసివేసింది. రియల్ఎస్టేట్‌గా మార్చేందుకు కంకణం కట్టుకుంది. తొలుత ఆధునీకరణతో పేరుతో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని మూసివేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సామర్థ్యానికి తగ్గ చెరకు అందుబాటులో లేకపోవడం వల్ల తెరిపించలేమని జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెబుతున్నారు. పైగా రైతులే తగినంతగా చెరకు పండించడం లేదంటూ బుకాయిస్తోంది. ఈ నేపథ్యంలో ధర కల్పించాల్సిన బాధ్యత ఎవరిది అంటూ ఎపి రైతు సంఘం, సిపిఎం నాయకులు ప్రశ్నిస్తున్నారు. వీరి ఆధ్వర్యాన చెరకు రైతులు సుదీర్ఘకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధర కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి లేదా? కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదు? రాష్ట్రంలోనైనా పెంచే ఆలోచన ఎందుకు చేయడం లేదు? తమకు ఇస్తున్న ప్రోత్సాహకాలేమిటి? అని చెరకు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం సుగర్ ఫ్యాక్టరీలను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడం లేదా రియల్ ఎస్టేట్‌గా మార్చడం వంటి చర్యలకు పాల్పడుతోందని ఎపి రైతు సంఘం, చెరకు రైతు సంఘం నాయకులు విమర్శిస్తున్నారు. అందుకు తగ్గట్టే సీతానగరం పరిధిలోని ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ ఆస్తులను వేలం వేశారు. వీటిని అధికార పార్టీకి చెందిన నాయకులే వసపర్చుకున్నారని కూడా విమర్శలు ఉన్నాయి. దీనికి సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం సుమారు 40 నుంచి 60కిలో మీటర్ల దూరంలోవున్న రేగిడి మండలం సంకలి సుగర్ ఫ్యాక్టరీలో క్రిషింగ్ ఏర్పాట్లు చేశామని ఉచిత సలహాలు ఇస్తోంది.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2014 నుంచి చెరకు సాగు

సంవత్సరం	విస్తీర్ణం (ఎకరాల్లో)
2014-15	37,297
2015-16	34,230
2016-17	33,180
2017-18	31,191
2018-19	29,237
2019-20	22,407
2020-21	14,882
2021-22	12,190
2022-23	11,265

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

22న తుది ఓటరు జాబితా

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-పార్వతీపురం

ఓటరు జాబితా జాబితాను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల చివరితేది వరకు ఫారం-6 ద్వారా కొత్త ఓటర్లుగా చేరుటకు అవకాశం ఉంటుందని తెలిపారు. వారి పేర్లను సప్లిమెంటరీ జాబితా ద్వారా విడుదల చేస్తామని చెప్పారు. ఓటరు జాబితాలో పేరు, అడ్రసు మార్పు, ఒకేడోరు నెంబరు తదితర సమారు 95 వేల సవరణలు చేసి సరిదిద్దినట్లు తెలిపారు. సంపూర్ణమైన ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో ప్రతి విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చామన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్లపై ప్రజలకు అవగాహన కల్పించుటకు జిల్లాలో శాశ్వత సెంటర్లు, మొబైల్ ప్రదర్శన వ్యాన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదికి ప్రతిపాదిత ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 7,70,525 మంది ఉన్నారని వెల్లడించారు. వారిలో 3,76,220 మంది పురుషులు, 3,94,240 మహిళలు, 65 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారని వివరించారు. ముసాయిదా ఓటరు జాబితాపై ఈ నెల 17వ తేదీ వరకు వచ్చిన క్లెయిములు, అభ్యంతరాలను పరిష్కరించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 1,86,354 ఫారాలు స్వీకరించగా, వాటిలో 1,79,811 ఫారాలు పరిష్కరించి ఓటరు జాబితాలో చేర్చామని చెప్పారు. 4991 తిరస్కరణకు గురయ్యాయని, 290 పరిష్కరించాల్సి ఉందని తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి ప్రతినిధి పారిశర్ల అప్పారావు, టిడిపి ప్రతినిధి జి.వెంకటనాయుడు, సిపిఎం ప్రతినిధి రెడ్డి వేణు, బిఎస్‌పి ప్రతినిధి టి.వెంకటరమణ, వైసిపి ప్రతినిధి సిహెచ్.సంతోష్‌కుమార్, ఎస్.ఉమామహేశ్వరరావు పాల్గొని జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సంతృప్తి వ్యక్తం చేశారు.

బస్సుల కోసం నిరీక్షణ

వీరఘట్టంలో అంబేద్కర్ జంక్షన్ వద్ద బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ప్రజాశక్తి-వీరఘట్టం

సంక్రాంతి పండగకు వచ్చిన వారంతా ఆయా కుటుంబాలు, బంధుమిత్రులతో సంతోషంగా గడిపి బుధవారం తిరుగుముఖం పట్టారు. కానీ ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు బస్సులు లేకపోవడం, సమయానికి రాకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద అటువైపు పాలకొండ, ఇటువైపు పార్వతీపురం వెళ్లేందుకు సకాలంలో బస్సులు రాలేదు. దీంతో ప్రయాణికులు ఎండల్లోనే గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఒకవేళ బస్సులు వచ్చినా రద్దీగా ఉండటం వల్ల ఇరుకిరుకుగా ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరికొంతమంది ప్రయివేటు వాహనాలను ఆశ్రయించారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి బొత్స సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

ప్రస్తుత ఖరీఫ్ సీజనులో జిల్లాలో ధాన్యం సేకరణలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు చేశామన్నారు. ఖరీఫ్ సీజనులో ధాన్యం సేకరణ ప్రక్రియ జరుగుతున్న తీరుపై మంత్రి బుధవారం విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, పౌరసరఫరాల సంస్థ డిఎం మీనాకుమారి, డిఎస్ఒ మదుసూదన్, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, డిసిఒ రమేష్, మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ధాన్యం సేకరణ జరుగుతున్న తీరును కలెక్టర్, జెసిలు మంత్రికి వివరించారు. రైస్ మిల్లర్లు తమ సమస్యలపై మంత్రికి వివరించగా ఆయా అంశాలపైన మంత్రి అధికారులతో సమీక్షించారు. ఏదైనా మండలం నుంచి వచ్చిన ధాన్యం అక్కడ మిల్లులకు కేటాయించగా మిగిలిన తర్వాతే ఇతర మండలాలకు తరలించాలని ఆదేశించారు.

అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో 3.40 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యానికి గాను ఇప్పటివరకు 2.67 లక్షల టన్నులు రైతుల నుంచి సేకరించామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి గాను రూ.400 కోట్లు వారి ఖాతాల్లో జమచేశామన్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ చేపట్టిన ఇ- క్రాప్ నమోదు ఆధారంగా వరి పంట దిగుబడిని అంచనా వేసి స్థానిక వినియోగానికి పోను 3.40 లక్షల టన్నులు మార్కెట్‌కు వస్తుందని జిల్లా అధికారులు అంచనా వేసినట్టు మంత్రి వెల్లడించారు. ఈ మేరకు లక్ష్యాన్ని నిర్ణయించుకొని ధాన్యం సేకరణ చేపట్టామన్నారు.

19న జన్ భగీధరి

పార్వతీపురంలో మారథాన్

జెసి గోవిందరావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఈ నెల 19న జిల్లాలో జన్ భగీధరి కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. జన్‌భగీధరి కార్యక్రమంపై బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడలో 125 అడుగుల ఎత్తు గల అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా జన్ భగీధరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 19న ఉదయం 7 గంటలకు సెయింట్ పీటర్స్ పాఠశాల నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు మారథాన్ జరుగుతుందని, అనంతరం మానవహారం ఉంటుందని అన్నారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉదయం 11 గంటల నుండి ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరం ప్రాంగణంలో అంబేద్కర్ జీవిత చరిత్రపై ఛాయా చిత్ర ప్రదర్శన, సిగ్నేచర్ క్యాంపెయిన్, సభ జరుగుతుందని ఆయన వివరించారు. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. సామాజిక న్యాయం అవగాహన కార్యక్రమం భారీ ఎత్తున చేపట్టాలన్నారు.

మాట్లాడుతున్న జెసి గోవిందరావు

ఈ సమావేశంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్ర రావు, జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వర రావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా ప్రజా రవాణా అధికారి టివిఎస్ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులివ్వడం దుర్మార్గం

సమాధానాలు ఇచ్చిన అంగన్వాడీలు ● వెంటనే నోటీసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ ● 37వ రోజుకు నిరవధిక సమ్మె

బలిజిపేట.. షోకాజ్ నోటీసులతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు ఆమోదించకుండా రాష్ట్ర ప్రభుత్వం తమ పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తోందని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులపై మండిపడింది. వెంటనే నోటీసులను ఉపసంహరించుకోవాలని సిడిపిఒలను డిమాండ్ చేసింది. జిల్లాలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన చేపట్టిన నిరవధిక సమ్మె 37వ రోజు బుధవారం కొనసాగింది.

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు పట్టణంలో అంగన్వాడీల సమ్మె శిబిరం 37వ రోజు బుధవారం కొనసాగింది. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ వి.ఇందిర అంగన్వాడీలకు మద్దతు తెలిపి, మాట్లాడారు. ప్రభుత్వం బెదిరింపులకు దిగుతోందని, వాటికి భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇటీవల ఎస్మా చట్టంలో భాగంగా కార్యకర్తలకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎ.నారాయణమ్మ, శశికళ ఆధ్వర్యాన కార్యకర్తలు, హెల్పర్లు ఐసిడిఎస్ పిఒ ప్రభుత్వం కవ్వింపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపతమ్మ సుభద్ర సుజాత పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సరళరాణి, గంట జ్యోతి ప్రాజెక్టు నాయకులు, సరళారాణి, అలివేలు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, కోశాధికారి గొర్లి వెంకటరమణ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం షోకాజు నోటీసులు జారీచేసిన ఐసిడిఎస్ పిఒ శ్రీనివాసరావుకు సమాధానాలు ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను నెరవేర్చితే విధుల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నామని వారంతా తెలిపారు. అంతేతప్ప బెదిరింపులకు తలొగ్గేది లేదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పాలక రంజిత్ కుమార్, అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.రాజేశ్వరి, బి.శాంతి, ఎం.గౌరీ, సరస్వతి, కవిత, నాగసులోచన పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట ఐటిడిఎ ఎదుట అంగన్వాడీల నిరవధిక సమ్మె శిబిరం 37వ రోజు కొనసాగింది. ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసుకు సమాధానాలు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమి, సిఐటియు అధ్యక్షులు సురేష్, కార్యదర్శి ఎం.కాంతారావు, అరుణకుమారి, ప్రియ, అంజలి పాల్గొన్నారు.

బలిజిపేట : బలిజిపేటలోని ఐసిడిఎస్ పిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన తెలిపారు. అనంతరం షోకాజ్ నోటీసులకు అంగన్వాడీలు సమాధానమిచ్చారు. వీరికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు మద్దతు తెలిపారు. నాయకులు గవర వెంకటరమణ, దాలమ్మ, రామలక్ష్మి, సావిత్రి, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : మండల కేంద్రంలో నిరసన శిబిరం వద్ద అంగన్వాడీలు షోకాజు నోటీసులు పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం సిడిపిఒ సుగుణకు సమాధానాలు రాసి అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు సిహెచ్ గౌరమ్మ , ఉపాధ్యక్షులు సిరిక అనురాధ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గరుగుబిల్లి మండల సెక్టార్ లీడర్లు సిహెచ్ గౌరమ్మ, డి.పద్మావతి, ఎం.సావిత్రి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు భోజనం వడ్డిస్తున్న కోలా రంజిత్ కుమార్

అంగన్వాడీలకు ఆత్మీయ విందు

కురుపాం : అంగన్వాడీల సమస్యలపై 37 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్ అన్నారు. బుధవారం అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి, సంఘీభావం తెలిపారు. మధ్యాహ్నం వారికి విందు భోజనం ఏర్పాటు చేశారు. పండగలను సైతం లెక్క చేయకుండా కుటుంబ సభ్యులను విడిచిపెట్టి పోరాటం చేస్తున్న అంగన్వాడీల పోరాట పటిమను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కె.వి.కొండయ్య, జనసేన పార్టీ నాయకులు ఎన్.వంశీ, టిడిపి నాయకులు బోటు గౌరీ, లైలా, చంటి, గవరయ్య, మురళి, రాజు, గంగులు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో పిఒతో మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు ; సీతంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు ; కొమరాడలో షోకాజ్ నోటీసులతో నిరసన చేపడుతున్న అంగన్వాడీలు

మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

జెఎఎస్‌తో ప్రజారోగ్య సంరక్షణ

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. బుధవారం పట్టణంలో జగన్నాథపురం ప్రాంతంలోని పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబకు 1.6 కిలోల వెండి విరాళం

ప్రజాశక్తి-మక్కువ

స్థానిక చదురుగుడిలో పోలమాంబ అమ్మవారికి పెందుర్తికి చెందిన సాయికిరణ్- రమ్యకీర్తి దంపతులు 1.6 కిలోల వెండి వక్షస్థలం విరాళంగా అందజేసినట్లు ఆలయ ఇఒ వివిఎస్ నారాయణ తెలిపారు. ముందుగా వెండి ఆభరణాన్ని మంగళ వాయిద్యములతో ఊరేగింపుగా ఆలయ మండపం వద్దకు తెచ్చారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, అనంతరం అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ దాలినాయుడు, పి.సన్యాసినాయుడు, గంజి బుచ్చినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న కౌన్సిలర్లు, నాయకులు

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-సాలూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం పట్టణంలోని 26వ వార్డులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎస్ఎస్ఆర్ రియల్ ఎస్టేట్ డైరెక్టర్ ఎన్.సూర్యయాదవ్ ఆధ్వర్యాన నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు వార్డు కౌన్సిలర్లు పి.సన్యాసమ్మ, సింగారపు ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్ బి.పైడిరాజు, వైసిపి నాయకులు బీసపు బాలకృష్ణ, వార్డు పెద్దలు గౌడు రమణ, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ రెడ్డి ధర్మారావు, యడ్ల శంకరరావు, బి.జగదీష్, జి.రామారావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సూర్యయాదవ్ మాట్లాడుతూ తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు చెప్పారు.

టిడిపిలో చేరిన వారికి కండువాలు వేస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

టిడిపిలో 50 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం తుంబలి పంచాయతీలో గంగంపేట, చినతుంబలి గ్రామాల నుంచి 50 కుటుంబాలు బుధవారం వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి ఆధ్వర్యంలో వారంతా టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పరిపాలన ఎలా ఉందో ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. సొంత పార్టీలో ఉన్న కార్యకర్తలకు న్యాయం చేయలేకపోతే ప్రజలకు ఇంకేమీ న్యాయం చేస్తారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో కచ్చితంగా టిడిపి గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, జియ్యమ్మవలస మండల కన్వీనర్ పల్ల రాంబాబు , మాజీ సర్పంచ్ పుడి సీతారాంనాయుడు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే పంచాయతీల అభివృద్ధి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు తయారీ విజయవంతంగా పూర్తి కావాలంటే అందరి భాగస్వామ్యం అవసరమని ఎంపిడిఒ జి.పైడితల్లి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారీపై బుధవారం పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధికి కచ్చితమైన ప్రణాళికలు అవసరమన్నారు. వాటిని తయారు చేసేందుకు అందరి భాగస్వామ్యం ఎంతైనా అవసరం ఉందన్నారు. ముందస్తు ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేయవచ్చని తెలిపారు. ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఇటువంటి శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతా యని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు చింతల వెంకట కురిమినాయుడు, తిరుపతి, భాస్కరరావు, సూరు శ్రీనివాసరావు, అల్లు రమేష్, డొక్కర దిలీప్ కుమార్, దత్తి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

19న నీలానగరంలో ఆరోగ్య సురక్ష శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నీలానగరం గ్రామంలో ఈ నెల 19న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ డి.శ్వేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైద్యాధికారులతోపాటు గ్రామ సచివాలయ సిబ్బంది సమయానికి హాజరుకావాలని సూచించారు.

చలివేంద్రిలో జనసేన జెండావిష్కరణ

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి గ్రామంలో బుధవారం జనసేన పాలకొండ నియోజకవర్గ సమన్వయకర్త నిమ్మక నిబ్రమ్ ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన, టిడిపి బలోపేతానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఉత్తరాంధ్ర నాయకులు బి.పి.నాయుడు, మాజీ సర్పంచ్ ఎన్.శశికుమార్ పాల్గొన్నారు.

9 మంది అరెస్టు

రూ.లక్షా 79 వేలు స్వాధీనం

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని మహంతి వీధిలో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి, తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు టౌన్ ఎస్ఐ కెవి సురేష్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేపట్టినట్లు వివరించారు. వారి నుంచి రూ.లక్షా 79 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

గ్రామ స్వరాజ్యం.. ఎలా సాధ్యం?

గాంధీ కన్న కలలు నిజం కావాలని, గ్రామస్థాయిలో సుపరిపాలన ప్రజలకు అందించడమే తమ ఉద్దేశమని ముఖ్యమంత్రి నుంచి స్థానిక ప్రజాప్రతినిధి వరకూ ఏ కార్యక్రమం, సమావేశం జరిగినా ఒకటే ఊకదంపుడు ఉపన్యాసం. ఆచరణకు వచ్చేసరికి చిత్తశుద్ధి కరువవుతోంది. అందుకే పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ప్రభుత్వ భవనాలు అర్ధాంతరంగా దర్శమిస్తున్నాయి. ఎంతో అట్టహాసంగా శంకుస్థాపనలు చేసిన సచివాలయాలు, రైతుభరోసా, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణాలు అనేక చోట్ల పునాదులకే పరిమితం అయ్యాయి.

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు
- కొన్నిచోట్ల పునాదులకే పరిమితం
- బోర్డులు తప్ప భవనాలు కరువు
- వీరఘట్టం మండలంలో ప్రభుత్వ భవనాల పరిస్థితి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని 24 సచివాలయాలున్నాయి. వాటి పరిధిలో 24 రైతు భరోసా కేంద్రాలు, 17 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులు చేపట్టారు. మండలంలోని వండువ, కిమ్మి, తలవరం, కత్తులకవిటి, తూడి, చిదిమి, నడిమికెల్ల, చిట్టపూడివలస, దశమంతపురం, హుస్సేనపురం, తెట్టంగి గ్రామాల్లో సచివాలయ భవనాలకు సంబంధించి దాదాపుగా పనులు పూర్తయ్యాయి. వండువ, తెట్టంగి గ్రామాల్లో మాత్రమే ప్రారంభోత్సవం జరిగాయి. మిగిలిన చోట్ల పనులు పూర్తి అయినప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. వీరఘట్టంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద స్లాబ్‌లకే పరిమితమయ్యాయి. రేగులపాడు, నడుకూరు, చలివేంద్రి, చిన్నగార కాలనీ, బిటివాడ, నీలానగరం, తదితర గ్రామాల్లో పునాదులకే పరిమితమయ్యాయి. నీలానగరం గ్రామంలో సచివాలయ కార్యకలాపాలు గ్రామంలో కోటి రూపాయలతో నిర్మించిన వసతిగృహంలో కొన సాగుతున్నాయి.

చిన్నగారకాలనీలో తవ్వకాలు చేపట్టి వదిలేసిన హెల్త్ క్లినిక్

దశమంతపురంలో పునాదులకు పరిమితమైన రైతు భరోసా కేంద్రం

వీరఘట్టంలో బోర్డుకు పరిమితమైన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్

చెట్ల కింద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

పునాదులకే పరిమితం

మండలంలోని దశమంతపురం, రేగులపాడు, వీరఘట్టం, చిన్నగారకాలనీ, చలివేంద్రి, నడుకూరు, నడిమికెల్లా, వండువ, నర్సిపురం, కంబర తదితర గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు పునాదులకే పరిమితమయ్యాయి. కిమ్మి, బిటివాడ, హుస్సేనపురం గ్రామాల్లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. చిదిమి, చిట్టపూడివలస, తూడి, తెట్టంగి, పనసనందివాడ, తదితర గ్రామాల్లో స్లాబులు వేసి దర్శనమిస్తున్నాయి. నీలానగరం గ్రామంలోని వసతిగృహంలో ఆర్‌బికె నిర్వహణ కొనసాగిస్తున్నారు.

బోర్డులకే పరిమితమైన వైఎస్ఆర్ క్లినిక్‌లు

మండలంలోని చిన్నగారకాలనీ, దశమంతపురం, చలివేంద్రి, చిదిమి, వీరఘట్టం, తలవరం, పనసనందివాడ, కంబర, చిట్టపూడివలస, కిమ్మి, నడిమికెల్ల, తెట్టంగి గ్రామాల్లో వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌లు బోర్డులకు పరిమితం అయ్యాయి. గ్రామాల్లో 104 సేవలు అందించినప్పుడు చెట్ల నీడలో, ఇరుకైన గదుల్లో ప్రజలకు సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

గ్రామాల్లో ఆర్భాటంగా శంకుస్థాపనలకు పరిమితం అయ్యారే తప్ప ఎక్కడా పూర్తి కాకపోవడంతో సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, వైద్య సిబ్బంది విధులు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సిబ్బంది పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైసిపి సిట్టింగుల్లో గుబులు

సర్వే ఆధారంగా సీట్ల కేటాయింపు, బదలాయింపు



ప్రజాశక్తి- విజయనగరం టౌన్

వైసిపి సిట్టింగుల్లో గుబులు రేగుతోంది. వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సర్వే ఆధారంగా టికెట్లు ఖరారు చేయనుండడంతో వీరిలో ఆందోళన నెలకొంది. సర్వేలను ఆధారం చేసుకుని రాష్ట్ర వ్యాప్తంగా 72 మందికిపైగా అభ్యర్థులను మార్చనున్నట్లు అందుతున్న సంకేతాలు వెలువడిన నేపథ్యంలో విజయనగరం, మన్యం ఉమ్మడి జిల్లాల పరిధిలోని 11 అసెంబ్లీ స్థానాల్లో సగానికి పైగా ఎమ్మెల్యేల్లో అయోమయం నెలకొంది. ఇప్పటికే రాజాం, బొబ్బిలి, ఎంపి స్థానాల పరిధిలోని ఆశావహులు అభ్యర్థిత్వానికి కుస్తీ పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో టికెట్ల ఫైట్ పతాక స్థాయికి చేరుకుంది. ప్రతిపక్ష టిడిపి, జనసేన సమన్వయంతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో వైసిపి అప్రమత్తమైంది. ప్రతిపక్ష పార్టీల పొత్తు ప్రభావం కనిపించే ప్రాంతాలపై దృష్టి సారించింది. విజయనగరం జిల్లాలో విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, ఎస్.కోట, మన్యం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ ప్రాంతాలపై తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈరోజో రేపో 4వ ఫైనల్ జాబితాలో పేర్లు బయటపడే అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందు నుంచే గడప గడపకూ పేరుతో ఎమ్మెల్యేల పట్ల ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని తగ్గించే ప్రయత్నం చేసింది. వెనుకబడిన ఎమ్మెల్యేలను గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. మరో మూడు నెళల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో టికెట్లు లభించని ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తోంది. జిల్లా పరిధిలోని ఇప్పటికే రాజాం, బొబ్బిలి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్ టిక్కెట్ల కేటాయింపులపై అధిష్టానం క్లియర్ చేసినట్లు తెలుస్తుంది.

సర్వేలతోనే దిశా నిర్దేశం

అధికార వైసిపిలో సర్వేల ఆధారంగానే టికెట్లు లభించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. సుమారు నాలుగు, ఐదు సర్వేలను ముందు ఉంచుకుని నియోజకవర్గాల వారీగా సర్వేలు తేల్చిన ప్రజాదరణ కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యేల పనితీరును పరిశీలించి నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ అభ్యర్థుల్లో ఎవరికి టికెట్లు లభిస్తాయోననే టెన్షన్ నెలకొంది.

హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడుస్తున్న యువత

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేటలోని ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో బుధవారం పర్యాటకులు సందడి చేశారు. ముక్కనుమ సందర్భంగా పర్యాటకులు పిల్లలతో, బంధువులతో తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. ఆల్ ట్రైన్ వెహికల్ ఎక్కి పార్కు చుట్టుముట్టారు. ఆనంద విహార్ వద్ద డాన్సులు వేశారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఎంచక్కా షికార్లు చేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

జలవిహార్‌లో బోటు షికారు చేస్తున్న యువతులు

చదువుల పొదరిల్లు

- కార్పొరేట్‌కు తలదన్నేలా హడ్డుబంగి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల
- విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ప్రోత్సాహక తరగతులు ఇక్కడ ప్రత్యేకత
- ఏటా నూరుశాతం ఉత్తీర్ణత
- పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రుల ఆసక్తి

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో సీతంపేట ఐటిడిఎకు కూతవేటు దూరంలో ఉంది హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల. రోడ్డు పక్కనుంచి ప్రయాణిస్తుంటే పూల మొక్కలతో కార్పొరేట్ తరహాలో దర్శనమిస్తుంది. ఈ పాఠశాలలో మూడో తరగతి నుండి పదో తరగతి వరకు 598 మంది విద్యార్థినులు విద్యను అభ్యశిస్తున్నారు. గతేడాది 99 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షకు హాజరుకాగా, శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది పదో తరగతిలో 94 మంది విద్యార్థులను మార్చిలో పబ్లిక్ పరీక్షలు రాయడానికి సిద్ధం చేశారు.

ఫోకస్ స్టూడెంట్

ఈ పాఠశాలలో పదో తరగతిలో 94 మంది విద్యార్థులుంటే, వారిని 11 గ్రూపులుగా.. ఎ-ప్లస్, ఎ, బి-ప్లస్, బి, సి గ్రేడ్లుగా విద్యార్థులను విభజించారు. 11 గ్రూపుల్లో ఎ-ప్లస్ విద్యార్థి, సి గ్రేడ్ విద్యార్థి ప్రతి గ్రూపులో ఉంటారు. అందులో సబ్జెక్టు పరంగా సందేహం ఉన్న విద్యార్థికి తెలివైన విద్యార్థి నివృత్తి చేస్తారు. విద్యార్థుల వద్ద ఆ సందేహం నివృత్తి కాకుంటే, ఆ సబ్జెక్టు టీచర్ పరిష్కరిస్తారు. సులభ పద్ధతుల్లో బోధించడం, కొన్ని మెళకువలు చెప్పడం వంటివి చేస్తున్నారు.

ప్రోత్సాహక తరగతులు

పాఠశాలలో వెనకబడిన విద్యార్థినులకు ప్రోత్సాహక తరగతులు పేరిట ఇక్కడ ప్రత్యేక ఫోకస్ చేస్తున్నారు. సాయంత్రం 5.30 నుంచి 7:30 వరకు రోజుకు ఇద్దరు టీచర్లు చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 4.30 నుంచి 7.30 గంటల వరకు విద్యార్థినులను వారిలో వారే చదివిస్తారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ విద్యను అందిస్తున్నారు.

ఆహ్లాదకర వాతావరణం

ఈ పాఠశాలలో విశాలమైన స్థలం ఉండటంతో మనబడి నాడు-నేడు కార్యక్రమంలో సిసి రహదారి నిర్మించారు. కార్పొరేట్ తరహాలో భవనాలు కనిపిస్తాయి. పాఠశాల ఆవరణమంతా పూలమొక్కలు దర్శనమిస్తాయి. అంతేకాకుండా వంగ, టమోట, దుంపలు, మిర్చి, కంది పంటలు వేశారు. చిన్నపిల్లలు ఆడుకోవడానికి చిల్డ్రన్ పార్కు కూడా తయారు చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై హెచ్‌ఎం ప్రత్యేక దృష్టిసారించారు. ఎఎన్ఎం పాఠశాలలో ఉంటూ విద్యార్థినులను తనిఖీ చేస్తూ, ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహిస్తారు.

సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు.. ఇలా ఎన్ని ఉన్నా... ఐటిడిఎకు కూతవేటు దూరంలో ఉన్న హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు ప్రత్యేకత గుర్తింపు ఉంది. ఏ అధికారి, ప్రజాప్రతినిధి వచ్చినా ఆ పాఠశాలను చూపించడానికి అధికారులు తీసుకొస్తారు. ఎందుకంటే ఆ పాఠశాలలో విద్యా బోధన, మెనూ అమలు, ఆహ్లాదకర వాతావరణంపై ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. దీంతో ప్రతి ఏటా పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ ప్రవేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు. సీతంపేట మండలం నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి కూడా విద్యార్థులు చేరేందుకు వస్తున్నారు.

ఆహ్లాదకరంగా ఉన్న హడ్డుబంగి ఆశ్రమ పాఠశాల ఆవరణ

పాఠశాలలో ఏర్పాటుచేసిన పార్కు, ఆట వస్తువులు

క్రీడల్లో ముందంజ

ఇక్కడ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో సైన్స్ ప్రాజెక్టులు చేయడంలో ముందంజలో నిలుస్తున్నారు. గుంటూరులో గతేడాది అక్టోబర్‌లో జరిగిన ఖేలో ఇండియాలో అండర్-14, 17లో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌కు ఈ పాఠశాల ఎంపిక కావడంతో రూ.12 లక్షలు మంజూరైంది. దీన్ని అప్పటి పిఒ నవ్య ప్రారంభించారు. పిఎం స్కూల్ ఫర్ రేసింగ్ ఇండియాలో కూడా ఈ పాఠశాల ఎంపిక చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూ పక్కాగా అమలు చేస్తున్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఐటిడిఎ పూర్వ పిఒ నవ్య

100 శాతం ఉత్తీర్ణతకు కృషి

ఇప్పటికే ఐటిడిఎ పిఒ, డిడి ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. స్టడీక్లాసులు నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు దత్తత అధికారి ఎంపిడిఒ తనిఖీలు చేపడుతున్నారు. ఎంకరేజ్మెంట్ తరగతులు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనలు, సలహా మేరకు ప్రణాళికలు తయారుచేశాం. ప్రతిరోజూ తెల్లవారు జామున విద్యార్థులను చదివిస్తున్నాం. ఈ ఏడాది కూడా పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి అన్ని ప్రణాళికలు రూపొందించాం.

- బి.ఉమావాణి, ప్రధానోపాధ్యాయులు, గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, హడ్డుబంగి